


2లో..

## సమ్మె సక్సెస్

- విధులను బహిష్కరించిన ఉద్యోగులు
- పలు ప్రాంతాల్లో భారీ ప్రదర్శనలు


# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 253

పేజీలు : 08 | వెల: రూ.5/-

బుధవారం

జూలై 09, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





వివరాలు2లో..

# మూతపడి ఐదేళ్లు




## మ్యూజికల్ గార్డెన్‌కు ముహూర్తమెప్పుడో?

- కరోనా సమయంలో గేటుకు తాళం
- ఇప్పటికీ తెరుచుకోని వైనం
- రూ.3కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి
- ఓపెనింగ్‌కు ఎదురు చూపులు

ఉరుకులు, పరుగుల జీవితం గడుపుతున్న నగర ప్రజలకు కొంత ఉపశమనం కలిగించాలన్న లక్ష్యంతో వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలో ఏర్పాటు చేసిన కాకతీయ మ్యూజికల్ గార్డెన్ మూతబడి ఐదేళ్లు కావస్తోంది. కరోనా సమయంలో గేటుకు వేసిన తాళం ఇప్పటికీ తెరుచుకోలేదు. పార్కును అభివృద్ధి చేస్తున్నామంటూ పాలకులు ప్రకటనలు చేయడం తప్ప అవి ఎప్పటి వరకు పూర్తి అవుతాయో ఎవ్వరూ చెప్పడంలేదు. ప్రారంభోత్సవ ముహూర్తం అప్పుడూ.. ఇప్పుడూ అంటూ సంవత్సరాలు గడిచిపోతున్నా తాళం తీసేవారే కరువయ్యారు. 18 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ పార్క్ ను 1994లో ప్రారంభించారు. భద్రకాళి చెరువు కట్టను ఆనుకుని సువిశాల స్థలంలో పచ్చని చెట్లతో కలర్ ఫుల్ గా కనిపించేది. ఇందులో ఏర్పాటు చేసిన మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తుప్పు పట్టిన ఆటవస్తువుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంతోపాటు గార్డెన్ ను మరింత ఆకర్షణీయంగా తీర్చి దిద్దాలన్న లక్ష్యంతో రూ.13.50 కోట్లతో పలు అభివృద్ధి పనులకు అప్పటి ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ 2017 నవంబర్ లో శంకుస్థాపన చేసినప్పటికీ నిధులు విడుదల చేయలేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.3కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. పనులు వేగవంతంగా పూర్తి అయినప్పటికీ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఫిక్స్ కావడం లేదు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి



8లో..

## శాకంబరీకి వేళాయే..

- భద్రకాళికి పోటెత్తనున్న భక్తులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు



## బాబా గుడిలో గురు పౌర్ణమి వేడుకలు

‘గురు పౌర్ణమి’ పర్వదినాన్ని పురస్కరించుకొని హనుమకొండ సాయిబాబా మందిరంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు మందిర చైర్మన్ హరగోపాల్ శర్మ, ధర్మకర్తలు రాకం సదానందం, వెయ్యిగండ్ల రమేష్, పూస సురేష్ కుమార్, నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. ఉదయం కాగడ హారతితో ప్రత్యేక పూజ కార్యక్రమాలు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. అనంతరం అభిషేకాలు, మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, మధ్యాహ్న హారతి అనంతరం మహా అన్న ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి తుంగతుర్తి శేషగిరి రావు–వరలక్ష్మి దంపతులు ముఖ్య దాతలుగా వ్యవహరించనున్నారు. సాయంత్రం సంధ్యా హారతి, అర్చనల అనంతరం జరిగే పల్లకి సేవ, శేజహారతితో గురుపౌర్ణమి పర్వదినం ప్రత్యేక పూజలు ముగుస్తాయన్నారు. బాబా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ

## అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ కు.. అతి ఉత్కృష్ట సేవా పతకం

8లో..







# మూతపడి ఐదేళ్లు

- మ్యూజికల్ గార్డెన్ కు ముహూర్తమెప్పుడో?
- కరోనా సమయంలో గేటుకు తాళం
- ఇప్పటికీ తెరుచుకోని వైనం
- రూ.3కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి
- ఓపెనింగ్ కు ఎదురుచూపులు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రోజు రోజుకూ విస్తరిస్తున్న వరంగల్ నగరంలో నివాసముంటున్న ప్రజలతోపాటు, పర్యాటకులకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యాన్ని అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన కాకతీయ మ్యూజికల్ గార్డెన్ మూలకు పడి ఐదేళ్లు కావస్తోంది. 1994లో అట్టహాసంగా ప్రారంభించిన మ్యూజికల్ గార్డెన్ కొద్ది రోజుల పాటు పర్యాటకులతో కిటకిటలాడింది. ఇందులో ఏర్పాటు చేసిన మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి రోజు రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ షోను చూసేందుకు నగర ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చేవారు. సాధారణ దినాల్లో ఒక షో నిర్వహిస్తే, ఆదివారం, ఇతర పర్వదినాల్లో రెండు షోలు ఏర్పాటు చేసేవారు. దీనితోపాటు ల్యాండ్ స్కేసింగ్, డక్ పాండ్, పడవల చెరువు, వాటర్ పాల్స్, చిల్డ్రన్ గేమ్స్ పార్క్, కాక్టస్ గార్డెన్, ప్రాక్ రాక్ పాయింట్ డైనోసార్, ఇండోర్ చిల్డ్రన్ పార్క్, కాటేజీలు పర్యాటకులను అమితంగా ఆకట్టుకునేవి.

### పర్యాటక ప్రాంతం..

నగరం నడిబొడ్డున ఉన్న కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పర్యాటక ప్రాంతంగా కూడా ఖ్యాతి గడించింది. ఈ గార్డెన్ కు సమీపంలోనే రాష్ట్రంలోనే ప్రఖ్యాతి గాంచిన శ్రీ భద్రకాళి దేవాలయం, సమీపంలోనే కాకతీయ పురావస్తు శాఖ మ్యూజియం, పక్కనే గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం, చేరువలోనే ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు పెద్ద దిక్కుగా వెలుగొందుతున్న ఎంజీఎం ఆస్పత్రి ఉండడం మ్యూజికల్ గార్డెన్ కు కలిసొచ్చిందనే చెప్పవచ్చు. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో సేదతీరడంతోపాటు స్వచ్ఛమైన గాలి కోసం ఎంతో మంది మ్యూజికల్ గార్డెన్ ను ఆశ్రయించేవారు. మహిళలను అమితంగా ఆకట్టుకునే గులాబీ తోట, చిన్న పిల్లలు తమ ఇతర స్నేహితులతో కలిసి ఆనందంగా ఆడుకునేందుకు పిల్లల పార్క్ ఇలా ఎన్నో విషేశాలు పార్క్ వైపు పర్యాటకులను నడిపించేది.

### రూ.13.50 కోట్ల అంచనాతో..

కాకతీయ మ్యూజికల్ గార్డెన్ లో పిల్లలకోసం ఏర్పాటు చేసిన ఉపకరణాలు పూర్తిగా పాడయ్యాయి. అదే విధంగా మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్ లో లోపాల కారణంగా పనిచేయడం నిలిచిపోయింది. సందర్శకులు కూర్చుండి తిలకించేందుకు వీలుగా ఏర్పాట్లు చేసిన కుర్జీలు తుప్పు పట్టిపోయాయి. దీనికితోడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చెత్తా, చెదారంతో నిండి దుర్గంధం వెదజల్లడంతో సందర్శకుల సంఖ్య భారీగా తగ్గింది. గర్డెన్ ను ఆదునిక హంగులతో పునర్నిర్మాణం చేసేందుకు అప్పటి కేసీఆర్ సర్కార్ శ్రీకారం చుట్టింది. రూ.13.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు అప్పటి ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు 18 నవంబర్ 2017లో శంకుస్థాపన చేశారు. కాని నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

### రూ.3 కోట్లతో అభివృద్ధి..

కళా విహీనంగా మారిన కాకతీయ మ్యూజికల్ గార్డెన్ కు పూర్వ వైభవం తేవాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. రూ.3కోట్ల నిధులను కేటాయించడంతో పనులు చకచకా సాగాయి. అయితే అధికారుల నిర్లక్ష్యంతో కొన్ని పనులు పెండింగ్ లోనే ఉన్నాయి. గత కొంత కాలంగా ప్రారంభోత్సవానికి అప్పుడు.. ఇప్పుడూ అంటూ ప్రచారం జరుగుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి మ్యూజికల్ గార్డెన్ ను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.





# సమ్మె సక్సెస్

- విధులను బహిష్కరించిన ఉద్యోగులు
- పలు ప్రాంతాల్లో భారీ ప్రదర్శనలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ట్రేడ్ యూనియన్ సంస్థలు బుధవారం దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చాయి. దేశ వ్యాప్తంగా ఉన్న 10 సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు బంద్‌లో పాల్గొన్నాయి. ట్రేడ్ యూనియన్లకు రైతు సంఘాలు సైతం మద్దతుగా నిలిచాయి. దేశ వ్యాప్తంగా దాదాపు 25 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు తమ విధుల్ని బహిష్కరించినట్లు సమాచారం. వరంగల్ జిల్లా ఆల్ ట్రేడ్ యూనియన్ కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి వరంగల్ చౌరస్తా వరకు వందలాది మంది కార్మికులతో మహా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్, ఏఐసీటీయూ రాష్ట్ర నాయకులు నర్ర ప్రతాప్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు పాశం రవి, ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి కృష్ణ, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు బండి కుమార్, సంఘీభావంగా సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య, న్యూ డెమోక్రసీ పార్టీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, రైతు సంఘాల నాయకులు సోమిడి శ్రీనివాస్, సుధమల్ల భాస్కర్ తదితరులు కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు.

### మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో..

దేశవ్యాప్త సమ్మె లో భాగంగా తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ , ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. బల్దియాలో పని చేస్తున్న వివిధ విభాగాల కార్మికులు ఈ సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, కార్మికులందరినీ రెగ్యూలర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జన్ను ప్రకాశ్, నాయకులు ఓరుగంటి జీవన్ కుమార్, సింగారం కృష్ణా, కుమ్మరి అశోక్, కె.సుమన్, శ్రీను, మైధం అశోక్, రామక్రిష్ణ, హరీష్, దాసు, బొజ్జ రాజు, భిక్షపతి, మధు, ఆర్.ప్రశాంత్, శనిగరం శ్యామ్, ఎం.హరినాథ్, కవిత, సుజాత, వనమాల పద్మ, రాధాతోపాటు సుమారు 300 మంది కార్మికులు పాల్గొన్నారు.



### జర్నలిస్టుల ర్యాలీ..

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా వరంగల్ నగరంలో జరిగిన ర్యాలీ లో టెక్ రాష్ట్ర కార్యదర్శి బొక్కా దయాసాగర్, జిల్లా అధ్యక్షుడు పొడేటి అశోక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మచ్చిక వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ఈర్ల సురేందర్, కోశాధికారి రాజిరెడ్డి, ఎండీ అక్మల్, గుర్రాల శ్రీనివాస్, చిలువేరు శ్రీకాంత్, సదిరం కుమార్, మోడెమ్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలీలను రాజకీయంగా సన్నద్ధం చేయాలి

- పద్మశాలి సంఘం కీలక నిర్ణయాలు
- రాజకీయ సాధికారతకు ప్రణాళిక
- కమర్తపు మురళికి కృతజ్ఞతలు తెలిపిన కమిటీ
- పులికంటి రాజేందర్‌కు సన్మానం
- స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంసిద్ధత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో బీసీలకు స్థానిక సంస్థల్లో కల్పించబోయే 42 శాతం రిజర్వేషన్లకు అనుకూలంగా పద్మశాలీలను రాజకీయంగా సన్నద్ధం చేయడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం.
ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే పద్మశాలి అభ్యర్థులను ప్రోత్సహిస్తూ, వారికి జిల్లా కార్యవర్గం, రాష్ట్ర కార్యవర్గం పూర్తి మద్దతుగా నిలుస్తుందని సమావేశంలో తెలియజేశారు. ఈ నెల 30 లోపు హనుమకొండ జిల్లాలోని ప్రతి గ్రామంలో వార్డు కమిటీలు, మండల కమిటీలు, పట్టణ కమిటీలు, మున్సిపాలిటీల్లో డివిజన్ కమిటీలు, పూర్తిస్థాయిలో జిల్లా కమిటీ, మహిళా కమిటీ, యువజన కమిటీ, నేత కార్మికుల కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. జిల్లాలో జనాభా పరంగా పద్మశాలీలు అధికంగా ఉన్నప్పటికీ రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, ఈ వెనుకబాటుతనాన్ని తగ్గించడానికి ప్రతి పద్మశాలి బిడ్డనూ రాజకీయాల్లోకి తీసుకురావాలని తీర్మానించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి వార్డులో వార్డు మెంబర్‌గా, సర్పంచ్‌గా, మండల ఎంపీటీసీగా, జడ్పీటీసీగా పద్మశాలి బిడ్డలను పోటీ చేయించాలని తీర్మానం చేశారు. రాజకీయాల్లోకి రావడానికి ఆసక్తి ఉన్నవారి పేర్లను సేకరించి జిల్లా కమిటీకి అందజేయాలని, జిల్లా కమిటీ పరిశీలించి రాష్ట్ర కమిటీకి సిఫారసు చేస్తుందని తెలిపారు. ఈ విధంగా పోటీకి సిద్ధపడే వారికి సంబంధిత పార్టీల నుంచి టికెట్ ఇప్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బచ్చు ఆనందం ఆధ్వర్యంలో ఏర్పడి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించుకున్నారు. ఈ సంవత్సరం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. జిల్లాలోని పట్టణ పరిధిలో ఒక కూడలికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు నామకరణం చేసి, ఆయన విగ్రహాన్ని స్థాపించేలా కృషి చేయాలని నిర్ణయించారు. విగ్రహ ఏర్పాటు కోసం జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, మేయర్ ను కలవాలని తీర్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నలకు సుమారు రూ. 33 కోట్ల వ్యక్తిగత రుణాలను మాఫీ చేసినందుకు ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తూ, రుణమాఫీ కోసం కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, రాష్ట్ర కార్యదర్శి రామచంద్ర రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. హనుమకొండ పట్టణం నుంచి భద్రకాళి దేవస్థానం ట్రస్ట్ బోర్డు కమిటీలో డైరెక్టర్‌గా బింగి సతీష్‌ను నియమించినందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేస్తూ తీర్మానం చేశారు. అధిక జనాభా ఉన్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుండి నామినేటెడ్ పోస్టులను అత్యధికంగా పద్మశాలి సమాజానికి కల్పించి, వారి రాజకీయ అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి, మంత్రి కొండా సురేఖకు విజ్ఞప్తి చేయాలని తీర్మానించారు. జిల్లా కార్యవర్గంలో మీడియా కార్యదర్శిగా పనిచేస్తున్న పులికంటి రాజేందర్ గత సంవత్సరంలో సంఘం కోసం విశేషంగా కృషి చేసినందుకు గాను జిల్లా పక్షాన అభినందిస్తూ సన్మానించారు. అదేవిధంగా పద్మశాలి సమాజం కోసం, నేతన్నల కోసం 'నేతన్న టీవీ ఛానెల్'ను ప్రారంభించినందుకు ఆయనకు అభినందనలు తెలియజేశారు. జిల్లా కార్యవర్గ సమావేశం బచ్చు ఆనందం అధ్యక్షతన జూమ్ కాల్ ద్వారా జరిగింది. రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, జిల్లా కార్యదర్శి కేదాసి వెంకన్న, దిడ్డి రమేష్, ప్రచార కార్యదర్శి పులికంటి రాజేందర్, సంయుక్త కార్యదర్శి గైని సత్యనారాయణ, కోశాధికారి సత్తూరి సంతోష్, ఉపాధ్యక్షులు వెంగళ వేణుగోపాల్, గజవెల్లి రవీందర్, యువజన జిల్లా అధ్యక్షుడు గోరంట్ల కృష్ణ ప్రసాద్, కార్యదర్శి ప్రశాంత్, ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, చక్రపాణి, ఇతర కార్యవర్గ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేశారు.

# ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సీతక్క ఉద్యమ సహచరులు, కంకణాల విజయ సంతోష్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీనియర్ జర్నలిస్ట్, ఐజేయూ నాయకులు దాసరి కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు వల్లాల వెంకటరమణ విశిష్ట అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం చేసి పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, ఉపాధ్యక్షులు ఊటుకూరు సాయిరాం, విజయ సంతోష్ కుటుంబ సభ్యులు సి.హెచ్. కృష్ణ, సృజన, కే. శ్రీజిత, చిన్నారి తక్ష్వీ, మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు రామలీల తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పరుగులు

- బీఆర్ఎస్ విమర్శలపై ఎంపీ బలరాం నాయక్ ఫైర్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ముఖ్యమంత్రిని విమర్శించడం తప్ప బీఆర్ఎస్ నాయకులకు మరో పని లేదని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిన్న మహబూబాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటనను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు."మహబూబాబాద్ నియోజకవర్గానికి అవసరమైన అన్ని అంశాలను ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు వివరించాం. వాటిని త్వరలోనే మంజూరు చేయిస్తాం" అని ఎంపీ బలరాం నాయక్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో లేని పథకాలను కూడా అమలు చేస్తున్నామని, ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని, ఇటీవలే రెండు డీఏలను కూడా విడుదల చేశామని ఆయన గుర్తు చేశారు. అనంతరం మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ. 400 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు శంకుస్థాపన చేశారని తెలిపారు. బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ ఈ కార్యక్రమాల కోసం విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి సహకారంతో మహబూబాబాద్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మురళీ నాయక్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భరత్ చందర్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ఏబీవీపీ అవతరణ దినోత్సవం



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంధం సాంబరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏబీవీపీ పూర్వ కార్యకర్త, బీజేవైఎం కళాశాలల విభాగం రాష్ట్ర కన్వీనర్ మంద మహేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంద మహేష్ మాట్లాడుతూ, 1949 జూలై 9న ఢిల్లీ యూనివర్సిటీలో కేవలం ఎనిమిది మంది విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపీ, నేడు దేశవ్యాప్తంగా విస్తరించిందని తెలిపారు. విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతూ, విద్యార్థుల పక్షాన అనేక ఉద్యమాలు నిర్వహిస్తోందని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ విద్యార్థి పరిషత్ తన పోరాటాన్ని కొనసాగించిందని గుర్తు చేశారు. ఏబీవీపీలో పనిచేసిన అనేక మంది కార్యకర్తలు నక్సలైట్ల చేతిలో హత్యకు గురయ్యారని, జాతీయ జెండా కోసం ప్రాణాలు అర్పించిన సామాజిక కార్యకర్త మోహన్ రెడ్డి వంటి త్యాగధనులు ఎంతో మంది ఉన్నారని మహేష్ పేర్కొన్నారు. అంతేకాకుండా, ఏబీవీపీలో పనిచేసిన ఎంతో మంది కార్యకర్తలు ప్రస్తుతం ముఖ్యమంత్రులుగా, కేంద్ర మంత్రులుగా, ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సోమనాథ గోలి, సారంగపాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి సంబరాలు



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండలంలోని చల్లగరిగే గ్రామ పంచాయతీ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి సంబరాలను మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐకేపీసీసీ రమణాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణాదేవి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి సంబరాలలో భాగంగా బుధవారం చల్లగరిగ గ్రామంలోని సింధు మహిళా సంఘం మొదటి లీడర్ సంతపూరి భాగ్యను ఆదర్శ మహిళగా ఎంపిక చేసి ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. భాగ్య మహిళా సంఘం ద్వారా తీసుకున్న రుణాల ద్వారా అభివృద్ధి చెంది, గ్రామంలోని మహిళలందరికీ ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్క మహిళా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. అలాగే, 60 సంవత్సరాలు నిండిన మహిళలను కూడా సంఘంలో చేర్పించాలని, 15 నుండి 18 సంవత్సరాల లోపు అమ్మాయిలను సైతం సంఘంలోకి ఆహ్వానించడం జరిగిందని రమణాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీసీసీ రమణాదేవి, గ్రామైక్య సంఘం ప్రతినిధులు, వీవోఏ తడక శ్వేత, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏబీవీపీ జాతీయ విద్యార్థి దినోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, కేయూ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కాకతీయ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో 77వ జాతీయ విద్యార్థి దినోత్సవం, ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మెయిన్ గేట్ వద్ద జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ అగపాటి రాజుకుమార్, స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ కో–కన్వీనర్ చెట్ల సతీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే విద్యార్థుల కోసం, జాతీయవాదం కోసం పనిచేస్తున్న ఏకైక అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ అని అన్నారు. ఏబీవీపీ కేయూ అధ్యక్షుడు మేరుగు సాయి, ఇన్‌చార్జి డాక్టర్ నిమ్మల రాజేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉబ్బటి హరికృష్ణ, సెక్రటరీ శివ, పూర్వ అధ్యక్షులు గట్టు ప్రశాంత్, సరయు, పూర్వ నాయకులు ఎర్రగొల్ల శివాజీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# పేదల పక్షాన ఎమ్మెల్యే రేవూరి



**వరంగల్ వాయిస్, పరకాల :** ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నిరంతరం పేదల పక్షాన నిలబడతారని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదలకు న్యాయం జరుగుతుందని పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్ అన్నారు. పరకాల పట్టణ కేంద్రంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు మొదటి బేస్మెంట్ బిల్లులు మంజూరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ పథకం ఫలవంతం కావాలని, ఇళ్లు పూర్తిగా నిర్మించుకునేలా ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ, నిర్మాణంలో కార్యకర్తలను భాగస్వామ్యం చేసుకుంటూ లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నారని కొయ్యడ శ్రీనివాస్ తెలిపారు. 13, 14, 21 వార్డులలోని బండారి లక్ష్మి, గడ్డం శైలజ, జోరు విజయలలిత, ఎండీ అక్బరుద్దీన్ అలీలకు మొదటి బేస్మెంట్ బిల్లుగా లక్ష రూపాయలు మంజూరు కావడంతో వారంతా సంతోషం వ్యక్తం చేశారు. ఇది కేవలం పేదవాడి ఇంటి కల నెరవేర్చడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని, దీనికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కృషి ఎంతో ఉందని కొయ్యడ శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు ఎర్రబెల్లి భాస్కర్, బండి సదానందం, గౌడ్రెడ్డి సుధమల్ల రమేష్, మొగిలి పాల్గొన్నారు.

# శాకంబరీగా బంగారు మైసమ్మ



**వరంగల్, వరంగల్ వాయిస్:** వరంగల్ కాశిబుగ్గలోని శ్రీ బంగారు మైసమ్మ దేవి ఆలయంలో శాకాంబరి ఉత్సవాలను (అమ్మవారిని కూరగాయలతో అలంకరించుట) ఘనంగా నిర్వహించారు. ఈరోజు సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి వెల్దండి ఓంకార్, అయ్యకుడికాల కోటేశ్వర్, కుచన ఏకాంబరం, కుచన రవీందర్, కట్టర్ సతీష్, నల్ల సతీష్, రాయబారం యుగేందర్, కందగట్ల శ్రీనాథ్, నోముల రాజేశ్వర్, బిట్ల వెంకటరత్నం, వెల్దండి దామోదర్, గుండేటి రజనీకాంత్, పిల్లల వెంకన్న, వనం బాలరాజు, మార్త శంకర్, నలిమెల అజయ్, మామిడాల హర్షిత్, గట్టు పద్మ, ఉమా, లక్ష్మి, పాసికంటి లత, రజిత, శ్రీలత, వర్షిని, భవిత, అనుష, మామిడాల లత, హాద్య మహన్వితతో పాటు అధిక సంఖ్యలో భక్తులు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలిపిన బేతి సతీష్



**వరంగల్ వాయిస్, ములుగు :** రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు బుధవారం ములుగు జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వెంకటాపూర్ మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ బేతి సతీష్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపల్లి గ్రామస్తులు ములుగులోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపల్లి గ్రామస్తులు బోయిని సుధాకర్, కొంపెల్లి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని ఓర్వలేకే అవాకులు, చవాకులు

## ● బీఆర్ఎస్ కార్పొరేటర్లపై కాంగ్రెస్ ఫైర్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష బీఆర్ఎస్ కార్పొరేటర్లు అవాకులు, చవాకులు పేలుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు మండిపడ్డారు. బుధవారం హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, బీఆర్ఎస్ కార్పొరేటర్లకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని విమర్శించే స్థాయి లేదని దుయ్యబట్టారు. స్థానిక కార్పొరేటర్లు లేనట్టుగా పక్క నియోజకవర్గ కార్పొరేటర్లు మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యేకు మద్దతిచ్చే స్థానిక నాయకత్వం వారి పార్టీలో లేకపోవడం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. గత పాలకుల మాదిరిగా కాకుండా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రాంతాలను, స్థానిక అవసరాలను బట్టి నిధులను కేటాయిస్తున్నారని, పార్టీలకు అతీతంగా పాలన, అభివృద్ధి సాగిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు తమ వార్డులలో కేటాయించిన నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి 300 కోట్ల స్మార్ట్ సిటీ నిధులను తిరిగి తీసుకువచ్చి అమలు చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ కార్పొరేటర్ల డివిజన్లలో గడిచిన 18 నెలల్లో 45వ డివిజన్‌లో 4 కోట్లు, డిప్యూటీ మేయర్ డివిజన్‌లో 2.46 కోట్లు, పరకాల నియోజకవర్గానికి చెందిన 3 బీఆర్ఎస్ డివిజన్లలో 9 కోట్ల నిధులను కేటాయించిన విషయాన్ని ఆధారాలతో సహా మీడియాకు చూపించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు సయ్యద్ విజయ శ్రీ రజాలి, జక్కుల రవీందర్ యాదవ్, వేముల శ్రీనివాస్, ఏనుగు మానస రాంప్రసాద్, మామిండ్ల రాజు, నెక్కొండ కవిత కిషన్, గుంటి శ్రీనివాస్, చీకటి శారద ఆనంద్, కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ రాణి రవీందర్, మాజీ కార్పొరేటర్లు అబూబకర్, బొడ డిన్న, తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్, పుప్పాల ప్రభాకర్, నాగరాజు, సుంచు అశోక్, నాయకులు పులి రాజు, రహీమున్నీసా, నలుబోల సతీష్, కుమార్ యాదవ్, మాడిశెట్టి సతీష్ పాల్గొన్నారు.

# నిరుపేదలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** నిరుపేదలందరికీ పారదర్శకంగా, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆత్మకూరు మండలానికి చెందిన 25 మంది లబ్ధిదారులకు రూ. 7,65,500 విలువైన సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, సీఎంఆర్ఎఫ్ పథకం పేద ప్రజలకు వరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కమలాపురం రమేష్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బీరం సునంద సుధాకర్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, మాజీ సర్పంచులు పర్వతగిరి రాజు, కంచ రవికుమార్, పరకాల నియోజకవర్గ యూత్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్, మండల పార్టీ ఉపాధ్యక్షులు చిదిరాల శ్రీనివాసరెడ్డి, మండల అధికార ప్రతినిధి గఫూర్, మండల యూత్ అధ్యక్షులు తనుగుల సందీప్, కాంగ్రెస్ మండల నాయకులు బోరిగం స్వామి, అలువాల రవి, మిరియాల కుమారస్వామి, మండల ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టీబీ కేసులను గుర్తించాలి



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ బుధవారం స్టేషన్ ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీబీ ముక్త్ భారత్ అభయాన్ 100 రోజుల కార్యక్రమం అమలు తీరును ఆయన పరిశీలించారు. ముందుగా ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్, ప్రతిరోజూ ఎంతమంది రోగులు వస్తున్నారని ప్రశ్నించారు. దీనికి డాక్టర్ ప్రణీత స్పందిస్తూ.. సుమారు 50 మంది వైద్యం పొందుతున్నట్లు వివరించారు. అలాగే, ఓపీకి వచ్చిన వారిలో ఏడుగురు టీబీ అనుమానితులను ఎక్స్‌రే కోసం పంపినట్లు తెలిపారు. ఈ నెల 10 నుంచి 14 వరకు ఇప్పగూడెం, కోమటిగూడెం, నమిలిగొండ, సముద్రాల గ్రామాలలో క్యాంపులు నిర్వహించి టీబీ అనుమానితులను గుర్తిస్తామని డాక్టర్ ప్రణీత కలెక్టర్‌కు వివరించారు. కాన్పులపై కలెక్టర్ ఈడీడీ క్యాలెండర్‌ను పరిశీలించి వివరాలు కోరగా ఆరుగురిని ప్రసవాల కోసం ఎంసీహెచ్ కు పంపడం జరిగిందన్నారు. ఫార్మసీని సందర్శించి మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. టీబీ రహిత సమాజం కోసం కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. డాక్టర్ ప్రణీత, పీహెచ్ఎన్ రమణ, ఫార్మసిస్ట్ ప్రఫుల్ల, ల్యాబ్ టెక్నీషియన్ మహేష్, ఎంపీహెచ్ఎస్ పర్వీన్ సుల్తానా పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

## ● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్,భూపాలపల్లి :** ప్రజారోగ్యంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని ఆజంనగర్ గ్రామంలో పర్యటించిన ఆయన, జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు రూ. 16 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆర్టికల్ – 275(I) నిధులు రూ. 14 లక్షలతో ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన బర్త్ వెయిటింగ్ గదిని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రజారోగ్యంపై మునుపెన్నడూ లేని విధంగా ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఆసుపత్రులకు నిధుల కేటాయింపులు, నియామకాలపై దృష్టి సారిస్తున్నారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించి, అన్ని వివరాలను సక్రమంగా రోజువారీగా నమోదు చేయాలని డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. భూపాలపల్లి మండలం పంబాపూర్ గ్రామంలోని భీమ్ ఘనపూర్ చెరువు నీటిని దిగువన ఉన్న పంట పొలాలకు ఈరోజు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి నీటిపారుదల శాఖ ఈఈ ప్రసాద్, ఇతర అధికారులు, కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా తూము వద్ద ఎమ్మెల్యే టెంకాయ కొట్టి, చెరువులోకి పూలు చల్లి, అనంతరం తూము గేట్ వాల్వ్‌ను తిప్పి కిందికి నీటిని వదిలారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. నేడు ఆజంనగర్ గ్రామ యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కొత్తూరి ప్రవీణ్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో ప్రవీణ్ ఇంటి వద్ద ఎమ్మెల్యే శాలువా కప్పి, కేకు కోసి విషెస్ తెలిపారు. ప్రవీణ్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించాలి

## ● టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక నల్ల చట్టాలను ఎత్తివేయాలని, దేశంలో వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించాలని ఐజేయూ జాతీయ నాయకులు దాసరి క్రిష్ణారెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు డిమాండ్ చేశారు. బుధవారం దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపునకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు సంపూర్ణ మద్దతు తెలుపుతూ హనుమకొండలో జాతీయ కార్మిక సంఘాలు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక ఏకశిలా పార్క్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు చేరుకున్న అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి క్రిష్ణారెడ్డి, గాడిపెల్లి మధు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన చెల్లింపుల చట్టాలతో పాటు 44 చట్టాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కార్మిక సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతు ఇస్తున్నట్లు తెలియజేశారు. జర్నలిస్టులకున్న వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన చెల్లింపు చట్టాల పునరుద్ధరణతో జర్నలిస్టు వృత్తి ప్రమాణాలను కాపాడుకునేందుకు కేంద్రం తక్షణమే వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీ, ధర్నాలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు, ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి డాక్టర్ పొడిశెట్టి విష్ణు వర్ధన్, నాయకులు బండి పర్వతాలు, ఎండి ఉస్మాన్ పాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెకు టీడబ్ల్యూజేఎఫ్ సంఘీభావం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపునకు సంఘీభావంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) హనుమకొండ జిల్లా కమిటీ బుధవారం ర్యాలీ నిర్వహించింది. హనుమకొండలోని ఏకశిలా పార్కు నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు టీవీ రాజు, ప్రధాన కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన చెల్లింపు చట్టాలతో పాటు మొత్తం 29 చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకురావాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచనను తీవ్రంగా ఖండించారు. కార్మిక సంఘాలు చేస్తున్న ఈ సమ్మెకు పూర్తి మద్దతు తెలిపి, జర్నలిస్టుల ఐక్యతను చాటుకున్నామని వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను ఎత్తివేసే వరకు జర్నలిస్టులు ఐక్యంగా పోరాడాలని జాతీయ కౌన్సిల్ సభ్యులు చుంచు ఐలయ్య పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ, ధర్నా కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దామెర రాజేందర్, కోశాధికారి ఇసంపల్లి రమేష్, సంయుక్త కార్యదర్శి ఈర్ల తిలక్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి దాసరి విజయ్ కుమార్, కార్యవర్గ సభ్యులు మరుపట్ల శంకర్, పశ్చిమ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షులు గిరెడ్డి అనిల్, కార్యదర్శి దామెర వెంకటేష్, కోశాధికారి హుస్సేన్ నాయక్, సంపత్ రెడ్డి, కిరణ్, సుమన్, అంకేశ్వరపు రాజేందర్, ఆర్. అశోక్, ఎండీ బస్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సంఘాల నిరసన




**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** కేంద్రంలోని ఉద్యోగ, కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర ఉద్యోగ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం రఘునాథపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ, నిరసన కార్యక్రమంలో సీపీఐ జనగామ జిల్లా కార్యవర్గ సభ్యులు కావాటి యాదగిరి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కందుకూరు మల్లేశం, ధైర్య దానీలు, మండల కమిటీ సభ్యులు ముప్ప ఎల్లయ్య, పసల డానియల్, నాలుకపెల్లి దయాకర్, గొంగళ్ళ మహేందర్, పండుగ మల్లేశం, గుండ్ల మురళి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెకు మద్దతుగా పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలోని మెడికల్, హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రేడియోగ్రాఫర్ రాచమల్ల కృష్ణ, విష్ణుమూర్తి, సునంద, విజయలక్ష్మి, కరుణాకర్, రమేష్, నాగమణి, పద్మ, కవిత, సంధ్యారాణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

## హనుమకొండ కలెక్టరేట్ ఎదుట కార్మికుల నిరసన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, బీఆర్టీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐసీటీయూ, టీఎన్‌టీయూసీ హనుమకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట రెండు గంటల పాటు మహా ధర్నా నిర్వహించారు. కార్మికుల నినాదాలతో కలెక్టరేట్ ప్రాంతం మారుమోగింది. లోపలికి వెళ్ళడానికి ప్రయత్నించిన కార్మికులను సుబేదారి పోలీసులు అడ్డుకున్నారు. ధర్నాకు ముందు ఏకశిలా పార్కు నుంచిఅదాలత్, సుబేదారి మీదుగా వేలాది మంది కార్మికులతో మహా ప్రదర్శన నిర్వహించారు. దారి పొడవునా బీజేపీ కార్మిక వ్యతిరేక నినాదాలతో ప్రదర్శన కొనసాగింది. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కూర వెంకట్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జక్కు రాజు గౌడ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్, నున్న అప్పారావు, బీఆర్టీయూ జిల్లా నాయకులు నాయిని రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి హంసారెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. చుక్కయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి. ఉప్పలయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకులు ఎండి మైముదా, ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి ఎమ్మెస్ రావు, కార్మిక సంఘాల నాయకులు బొట్ల చక్రపాణి, బొల్లారం సంపత్, యాకయ్య, రజిత, ఈసంపెల్లి సంజీవ, వాంకుడోత్ వీరన్న, ఎం.రమలతో పాటు వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు.

# పరకాలలో కార్మికుల భారీ ర్యాలీ




**వరంగల్ వాయిస్, పరకాల :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు డి. తిరుపతి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెకు మద్దతుగా గురువారం పరకాల పట్టణంలో కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ. 26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్, కార్మిక సంఘాల నాయకులు, ఐఎన్‌టీయూసీ మున్సిపాలిటీ పరకాల పట్టణ అధ్యక్షులు బొచ్చు ఐలయ్య, ఉపాధ్యక్షులు మంద మహేష్, కార్యదర్శి పసుల సారయ్య, గుర్రం సరోజన, హమాలీ సంఘం అధ్యక్షులు ఆదాం, బొచ్చు సంపత్, రమేష్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు పోతిరెడ్డి సమ్మక్క, మేకల రాధ, జి.లింగా స్వామి, రాజయ్య, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవి, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు మడికొండ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలపై గుమస్తాల నిరసన




**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా వరంగల్ ఆల్ షాప్ గుమాస్తాల సంఘం ఆధ్వర్యంలో హంటర్ రోడ్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గుమాస్తాల సంఘం జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని బీజేపీ, తెలంగాణ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 282 జీవోను తీసుకొచ్చి కార్మికులు 10 గంటలు పని చేయాలని నిర్ణయం చేసింది. దీనివల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుంది" అని రామస్వామి పేర్కొన్నారు. తక్షణమే 282 జీవోను రద్దు చేసి, 10 గంటల పనిని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, గంజి రాజు, సత్యం, సంపత్, రాజశేఖర్, కిరణ్, రకిల్ రాజు, ప్రసాద్, రాధాకృష్ణ, మౌనిక, రమాదేవి, దీపిక, రజిత, రేణుక, స్రవంతి, లలిత, వేదవతి, జుబేరా, రాణి తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం చేయాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** హమాలీ కార్మికుల సంక్షేమం కోసం పార్లమెంటులో సమగ్ర సంక్షేమ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు పనాస ప్రసాద్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం వరంగల్‌లోని పాత రామా టాకీస్ నుండి పాత బీట్ బజార్ మీదుగా వరంగల్ చౌరస్తా వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ , ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎండి యాకూబ్, నాయకులు శంకర్, గొల్లపల్లి రమేష్, కోలా రాజ్ కుమార్, రమేష్, సోమయ్య, నగేష్, దేవేందర్, రాజేష్, సుధాకర్, రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మె విజయవంతం

◆ దాక్ సదన్ లో ఒకరోజు సమ్మె
◆ హైదరాబాద్‌లో పోస్టల్ ఉద్యోగుల నిరసన



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** కేంద్రంలోని ఉద్యోగ, కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర ఉద్యోగ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం తెలంగాణ వ్యాప్తంగా ఎన్‌ఎఫ్‌పీఈ (NFPE) యూనియన్ అనుబంధ సంఘాల ఉద్యోగులు చీఫ్ పీఎంజీ కార్యాలయం 'దాక్ సదన్'లో తలపెట్టిన ఒకరోజు సమ్మెలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ, ఏపీ కేంద్ర ఉద్యోగ సమాఖ్య ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అజీజ్ మాట్లాడుతూ పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. ఎనిమిదో వేతన సంఘాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలి. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి.




ఎన్‌ఎఫ్‌పీఈ సంఘానికి కోర్టు ఇచ్చిన తీర్పును అమలు పరచి గుర్తింపును పునరుద్ధరించాలి. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలి. 18 నెలల డీఏ బకాయిలను విడుదల చేయాలి. కారుణ్య నియామకాలలో 5శాతం సీలింగ్‌ను ఎత్తివేయాలి. జీడీఎస్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన జీతం అందించాలని తెలంగాణ పోస్టల్ ఉద్యోగులు ఈ సమ్మెలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌ఎఫ్‌పీఈ రాష్ట్ర కన్వీనర్ కామ్రేడ్ శ్రవణ్ కుమార్, అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యదర్శులు కామ్రేడ్ యు. మహేందర్, చారీ, శ్రీకాంత్, సోమేశ్, ముతేష్, మధుసూదన్, సీనియర్ కామ్రేడ్ డీ.ఎన్. మూర్తి, జనాభాయ్, లక్ష్మి, కవిత, పెన్షనర్ సంఘ నాయకులు, పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

## ములుగులో ఏబీవీపీ భారీ ర్యాలీ



**వరంగల్ వాయిస్, ములుగు :** ఏబీవీపీ ములుగు శాఖ ఆధ్వర్యంలో 77వ జాతీయ విద్యార్థి దినోత్సవం (ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం) కార్యక్రమాన్ని ఏబీవీపీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ రహదారిపై విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు జాతీయ రహదారిపై వరంగల్ విభాగ్ సంఘటన మంత్రి గుండు పృధ్వి చేతుల మీదుగా ఏబీవీపీ జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రస్తుత, పూర్వ విద్యార్థి పరిషత్ కార్యకర్తలు, వివిధ పాఠశాల, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన పూర్వ విద్యార్థి పరిషత్ కార్యకర్త గండ్రకోట కుమార్, వరంగల్ విభాగ్ సంఘటన మంత్రి పృథ్వీ సంయుక్తంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పూర్వ, ప్రస్తుత కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## శక్తివంతమైన విద్యార్థి శక్తి ఏబీవీపీ



**వరంగల్ వాయిస్, చిట్యాల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) చిట్యాల నగర కార్యదర్శి బుర్ర అభిజ్ఞ గౌడ్ ఆధ్వర్యంలో ఏబీవీపీ 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఎగురవేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బుర్ర అభిజ్ఞ గౌడ్ మాట్లాడుతూ శక్తివంతమైన విద్యార్థి శక్తిగా ఏబీవీపీ ఎదిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మొగుళ్ళ సాయి చరణ్, అజయ్, కృష్ణ, శశి, వర్ధన్, బుర్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ బుధవారం బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ రాజ్యాధికార సాధన జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు నడికూడ మండల ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ మండల కోఆర్డినేటర్ చుక్క రత్నాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వమే ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బుస్స తిరుపతి, బొల్లె క్రాంతి రాజ్, దొగ్గల తిరుపతి, బొల్లె అరవింద్, మేకల ప్రవీణ్, తిరుపతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాము కుటుంబానికి ఎలక్ట్రానిక్ మీడియా ఆర్థిక సాయం

**వరంగల్ వాయిస్. హనుమకొండ :** ఇటీవల ఆకస్మికంగా మరణించిన ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ వీడియో జర్నలిస్ట్ (హరిణి రాంప్రసాద్) ఎన్టీవీ రాము కుటుంబానికి హనుమకొండ ఎలక్ట్రానిక్ మీడియా టౌన్ రిపోర్టర్స్ తరఫున రూ. 5,000/- నగదును అందజేసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



## పెన్షనర్ల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

హనుమకొండ పెన్షనర్ల అసోసియేషన్ డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ హనుమకొండ జిల్లా సమావేశం బుధవారం హనుమకొండ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఈ.నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగింది. అధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం 2025 పెన్షనర్లకు వ్యతిరేకంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టం అమలు పరిస్తే భవిష్యత్తులో పెన్షనర్లకు పీఆర్సీ కానీ, డీఏలు కానీ లబ్ధి పొందే అవకాశం ఉండదని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం పెన్షన్లకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రస్థాయిలో పెన్షనర్లకు ఉన్న సమస్యలన్నీ కూడా ఉద్యమాల ద్వారా మాత్రమే పరిష్కారం అవుతాయని, ఆ దిశగా పెన్షనర్లు ఉద్యమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గత మార్చి 2024 నుండి జూన్ 2025 వరకు ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు రావలసిన పెండింగ్ బకాయిలన్నింటినీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వీరస్వామి మాట్లాడుతూ.. సమస్యల సాధనకు అందరూ సంఘటితంగా పోరాటం చేయాలన్నారు. తదనంతరం హనుమకొండ జిల్లాలోని హనుమకొండ ఎస్.టీ.ఓ పరిధి ఎన్నికలు జరిగాయి. జిల్లా ఉపాధ్యక్షులు ఎం.సింగారెడ్డి ఎన్నికల అధికారిగా, ఆగయ్య ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించగా అధ్యక్షుడిగా ఎల్. ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జి. రాజన్న, మహిళా ఉపాధ్యక్షులు ఎన్. సుభాషిణి, ప్రధాన కార్యదర్శిగా కే. దేవదాసు. సహాయ కార్యదర్శులు ఎం.మల్లయ్య, ఎం.దేవేందర్ రెడ్డి, ట్రెజరర్ ఎల్.గోవిందరెడ్డి, సలహాదారులుగా కె. సుధాకర్ రెడ్డి, జి. తిరుపతి రెడ్డిలు ఎన్నికయ్యారు.

## విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువులో ముందుండాలని, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆకాంక్షించే తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క జన్మదినాన్ని పురస్కరించుకొని హనుమకొండ జూలై వాడలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సుమారు 350 నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకురాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన సాహితి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన బడి బాట కార్యక్రమంలో భాగంగా, భవిష్యత్ తరాల పునర్నిర్మాణం కోసం పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అభినందించారు. మంత్రి సీతక్క జన్మదినం సందర్భంగా, సీతక్క స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఆకాంక్షతో ఈ చిన్న కార్యక్రమం నిర్వహించినట్లు సాహితి తెలిపారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల శ్రమదోపిడీ

● సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని మండిపాటు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) లో గత 25 ఏళ్లుగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ఇందిరా పార్క్ వరకు ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. నర్సింహ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులకు గత పీఆర్సీ సందర్భంగా రావాల్సిన ఏడు నెలల పీఆర్సీ ఏరియర్స్ నేటికీ అందలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సారంగుల బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సిద్దిపేట రాజేశ్వరి రెడ్డి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, పెద్దపెల్లి




జిల్లా అధ్యక్షులు ఎల్. సురేష్ నాయక్, జనగామ జిల్లా అధ్యక్షురాలు గంగరబోయిన జ్యోతి, పల్లె దావఖనా డాక్టర్స్ డాక్టర్ పుట్ట మహేందర్ రావు, డాక్టర్ శ్రీనివాసు, డాక్టర్ దయానంద్, డాక్టర్ వినయ్, మేడ్చల్ జిల్లా ట్రెజరర్ పార్థసారథి, నవీన్, 2వ ఏఎన్‌ఎంలు శ్యామల, ఎం.ఎల్.హెచ్.పి. నల్లగొండ జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం, జనగాం జిల్లా ఎం.ఓ. అసిస్టెంట్ దిలీప్ కుమార్, ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఎన్. శ్రీనివాస్, అకౌంటెంట్ మమత, నరసింహులు, దుర్గ, ఏఎన్‌ఎంలు సంధ్య, వినోద, సపోర్టింగ్ స్టాఫ్ అశోక్, శ్రీనివాస్, కాంటిజెంట్ వర్కర్స్ మల్లేశం, సాంబరాజు, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
బుధవారం 09 జూలై 2025
7

# దడక్ సీక్వెల్‌లో త్రిప్తి డిమ్రి




మరాఠిలో సూపర్ హిట్ అయిన సినిమా సైరాత్. రెండు వేరు వేరు కులాల మధ్య జరిగిన ప్రేమ కథగా వచ్చిన ఈ సూపర్ హిట్ సినిమా అనేక భాషల్లో రీమేక్ అయి హిట్ అయింది. అలా బాలీవుడ్ లోను దడక్ పేరుతో రీమేక్ చేసారు. శశాంక్ ఖైతాన్ దర్శకత్వంలో ఇషాంత్ కట్టర్ హీరో గా నటించగా ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ నిర్మించగా అజయ్, అతుల్ సంగీతం అందించారు. అలనాటి అందాల తార శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ ఈ సినిమాతోనే సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ– ఇచ్చింది. అయితే ఇప్పుడు ఈ సినిమాకు స్వీక్వెల్ గా దధక్ 2 ను వస్తోంది. అయితే తీసిందే రీమేక్ సినిమా దానికి మళ్ళీ సీక్వెల్, ఏంటో బాలీవుడ్ మేకర్స్ వెర్రి అనే కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్. సరైన కథలు లేక ఇలా రీమేక్స్ తో గడిపేస్తున్నారు అని టాక్ వినిపిస్తోంది. పోనీ సీక్వెల్ ను అయినా ఫస్ట్ పార్ట్ లో నటించిన వారితో చేస్తున్నారా అంటే అది లేదు. సిద్ధాంత్ చతుర్వేది హీరోగా యానిమల్ ఫెమ్ త్రిప్తి డిమ్రి హీరోయిన్ గా తెరకెక్కుతోంది దధక్ 2. అందుకు సంబందించి ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేసారు. ఈ సీక్వెల్ కు సాజిద్ ఇక్బాల్ దర్శకత్వం వహిస్తుండగా ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్ పై కరణ్ జోహార్ నిర్మిస్తున్నాడు. జీ స్టూడియోస్ సమర్పణలో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ ఈ నెల 11న రిలీజ్ కానుంది. అలాగే ఈ ఏడాది ఆగస్టు 1న రిలీజ్ కాబోతుంది



# బ్యాడ్ గర్ల్ మూవీకి సెన్సార్ ఓకే

తమిళం నుంచి వస్తున్న వివాదాస్పద చిత్రం బ్యాడ్ గర్ల్. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్, కోలీవుడ్ డైరెక్టర్ వెట్రిమారన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి శివరామన్ కథానాయికగా నటిస్తుంది. వర్షా భరత్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా విడుదలకు సెన్సార్ పలు అడ్డంకులు తెలిపిన విషయం తెలిసిందే. ఈ సినిమా విషయంలో సెన్సార్ బోర్డు మీదా కోర్టు వరకు కూడా వెళ్లాడు వెట్రిమారన్. అయితే ఎన్నో వివాదాలు ఎదుర్కోన్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ చెప్పిన పలు కట్‌లకు చిత్రబృందం అంగీకరించడంతో సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చింది బోర్డు. ఈ క్రమంలోనే ఈ చిత్రం విడుదలకు సిద్ధంమైంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు– చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ టీమ్ పోస్ట్ పెట్టింది. స్కూల్ స్టేజీ నుంచే తోటి విద్యార్థులలాగే తనకు ఓ బాయ్‌ఫ్రెండ్ ఉండాలనుకునే ఓ అమ్మాయి కథ ఈ చిత్రం. ఆచారాలు, కట్టుబాట్టు పాటించే కుటుంబంలో పుట్టిన ఈ అమ్మాయి తనకు నచ్చిన వాడిని ఎలా ఏంపిక చేసుకుంది. ఈ క్రమంలో ఆ అమ్మాయి జీవితంలో ఎదురైన సంఘటనలు ఏంటి అనేది ఈ సినిమా కథ. ఏ గ్రాస్ రూట్ ఫిల్మ్ కంపెనీ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.




# సిద్ధూ కొత్త సినిమా బడాస్

టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని వరుస సినిమాలతో అలరిస్తున్నారు యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ . తాజాగా ఆయన మరో కొత్త సినిమాను ప్రకటించారు. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణసంస్థ ఓ ఆసక్తికర పోస్టర్‌ను పంచుకుంది. 'బడాస్' పేరుతో ఇది రానున్నట్లు– తెలిపింది. రవికాంత్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్–టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది 'బడాస్' విడుదల కానుంది. మీరు ఇప్పటివరకూ హీరోలను, విలన్‌లను చూసి ఉంటారు. కానీ, ఇప్పుడు వారికి మించి చూస్తారు. ఈసారి కనికరం లేకుండా ఫైర్ సెట్ చేస్తాడు అని నిర్మాణ సంస్థ ప్రకటించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిరచనున్నారు. మంచి హిట్ కోసం ఎదురుచూస్తున్నారు సిద్ధూ జొన్నలగడ్డ. ఇటీవల 'జాక్' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు. అయితే ఆ చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ప్రస్తుతం ఆయన 'తెలుసు కదా'లో నటిస్తున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. నీరజ కోన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది.

# ఆగస్ట్ 7న కూలీ ప్రీ రిలీజ్ ఈవెంట్

తమిళ్ సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 'కూలీ'. తమిళ టాప్ దర్శకుడు లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అక్కినేని నాగార్జున, కన్నడ రియల్ స్టార్ ఉపేంద్ర, మలయాళ నటు–డు సౌబిన్ సాహిర్, కట్టప్ప సత్యరాజ్ వంటి స్టార్స్ నటిస్తున్న ఈ బిగ్గెస్ట్ మల్టీస్టారర్ ఆగస్టు 14న వరల్డ్ వైడ్ రిలీజ్ కాబోతుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ స్టార్ట్ చేస్తూ చికిటు– అని సాగే ఫస్ట్ లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. తెలుగులోను ఈ సినిమాను భారీ ఎత్తున రిలీజ్ చేయబోతున్నారు. కూలీ తెలుగు హక్కులను రూ. 45 కోట్లకు కొనుగోలు చేసారు ఆసియన్ సురేష్. అయితే తెలుగు స్టేట్స్ లో భారీ ఓపెనింగ్ రాబట్టాలంటే ఇప్పుడున్న బజ్ సరిపోదు. అందుకోసం రజినీ రంగంలోకి దిగాలి. ఈ నేపధ్యంలోనే కూలీ తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించేందుకు ఏర్పాట్లు– చేస్తున్నారు. అందుకోసం ఆగస్టు 7 డేట్ ను ఫిక్స్ చేసారు తెలుగు పంపిణీదారులు. ఈ ఈవెంట్ కు సూపర్ స్టార్ రజనీకాంత్ తో పాటు– లోకేష్ కనగరాజ్, అక్కినేని నాగార్జున హాజరుకానున్నారు. కూలీ నుండి సెకండ్ లిరికల్ సాంగ్ ను ఈ వచ్చే వారం విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. అక్కినేని నాగార్జున, పూజ హెగ్డే కాంబోలో రాబోతున్న ఈ సాంగ్ ను అనిరుద్ ఓ రేంజ్ లో ట్యూన్ చేసాడనే టాక్ ఉంది.



# శాకంబరీకి వేళాయే..

- భద్రకాళికి పోటెత్తనున్న భక్తులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహానగరంలోని సుప్రసిద్ధ శ్రీ భద్రకాళి దేవాలయంలో 15 రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన శాకంబరీ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నారు. శ్రీ భద్రకాళి దేవాలయంలో ఆషాఢ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని నిర్వహించనున్న శాకంబరి ఉత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం తెల్లవారు జామున 3 గంటలకు నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం వివిధ రకములైన కూరగాయలతో అమ్మవారికి శాకంభరీ అలంకారము ప్రారంభం కానుంది. అమ్మవారి అలంకారమునకు సుమారు 6 గంటల వ్యవధి పడుతుంది. ఈ సమయంలో అమ్మవారిని దర్శించుకొనేందుకు అవకాశం ఉండదు. అలంకరణను ఉదయం 9 గంటలలోపు పూర్తి చేసేలా పూజారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అలంకరణ పూర్తి అయిన తర్వాత శ్రీ భద్రకాళీ అమ్మవారి శాకంభరీ విశ్వరూప దర్శనం ప్రారంభమై రాత్రి వరకు కొనసాగుతుంది. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనముతో పాటు విశిష్ట దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ధర్మదర్శనం క్యూలైన్లు వేర్వేరుగా ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శేషుభారతి తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున తరలి వచ్చే భక్తుల రాకను పురస్కరించుకొని ప్రభుత్వ శాఖల నుంచి భద్రతా, తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 11 గంటలకు వ్యాసపూజ, మహాపూర్ణాహుతి, బనిప్రధానం, అవబృథంతో శాకంభరీ ఉత్సవ పరిసమాప్తి జరుగుతుందన్నారు. శాకంబరి ఉత్సవాల సందర్భంగా శ్రీ లక్ష్మి శ్రీనివాస సేవా సమితి, మహబూబాబాద్ కు చెందిన జీకే రెడ్డి ఆధ్వర్యంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు,సేవాసమితి సభ్యులు సుమారు ఎనిమిది క్వింటాళ్ల కూరగాయలను అమ్మవారికి సమర్పించారు.



### ముద్రా క్రమంలో అమ్మవారు..

శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు బుధవారం 14వ రోజుకు చేరుకున్నాయి. తిథిమండల దేవతా యజనంలో భాగంగా కాళీ క్రమాన్ని అనుసరించి అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని 'ముద్రా' గాను షోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని 'జ్వాలామాలినీ' గాను అలంకరించి పూజారాధనలు జరిపారు. చతుర్దశి తిథికి అధిదేవతయైన అమ్మవారి యొక్క ఒక్క విభూతి భద్రకాళీ అమ్మవారి భక్తులకు సంతోషాన్ని ప్రసాదిస్తుంది. మనిషికి కోరిన కోర్కెలు నెరవేరినపుడు సంతోషం కలుగుతుంది. అంటే ఆ అమ్మవారు భద్రకాళి అమ్మవారి యొక్క భక్తుల కోరిన కోర్కెలను నెరవేర్చి అమితమైన సంతోషాన్ని కలిగిస్తుంది కాబట్టి శాస్త్రములు అట్టి అమ్మవారిని ముద్రా అని కీర్తించాయి.



### శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవస్థానంలో..

కాకతీయ సామ్రాజ్య అధిష్ఠాన దేవి ఓరుగల్లు భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ హనుమద్గిరి పద్మాక్షి అమ్మవారి ప్రేరణతో భక్తుల సహకారంతో ఆషాఢ పౌర్ణమి (గురు పౌర్ణమి) గురువారం శాకంబరి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు పద్మాక్షి ఆలయ అనువంశిక వేద పండితులు నాగిళ్ల షణ్ముఖ శర్మ అవధాని తెలిపారు. అమ్మవారిని ఆకుకూరలు, కాయకూరలు, పండ్లతో విశేష శాకంబరిగా అలంకరించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 9.30 గంటలనుంచి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించనున్నట్లు ప్రకటించారు. కావున భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రుతు కావాలని నాగిళ్ల షణ్ముఖ శర్మ కోరారు.



## శాకంబరి అలంకరణలో మహాలక్ష్మి

### వైభవంగా ప్రారంభమైన గురుపౌర్ణమి వేడుకలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని ప్రముఖ అధ్యాత్మిక కేంద్రమైన శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రంలో బుధవారం శాకంబరి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. గురుపౌర్ణమిని పురస్కరించుకొని దత్తక్షేత్రంలోని.. శ్రీ అనగా మహాలక్ష్మి అమ్మ వారికీ 30 రకాల 300 వందల కిలోల వివిధ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో ఆలయ అర్చకులు రాపాక గోపికృష్ణ శర్మ అమ్మ వారిని అలంకరించారు. మహాలక్ష్మి అమ్మవారిని ప్రకృతి మాతగా అలంకరణ నిర్వహించిన అమ్మ వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమంలోని శ్రీ సంకట హర గణపతి, శ్రీ సచ్చిదనాందేశ్వర, శ్రీ వరద దత్తాత్రేయ స్వామీ, శ్రీ అనగామహాలక్ష్మి, శ్రీ కార్య సిద్ది అంజనేయ స్వామి, శ్రీ గురు పాదుకలకు కూరగాయలు అలంకరించి మహా మంగళ హారతితో శాఖంబరి వేడుకలు జరిపించారు. అనంతరం భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. వారికీ తీర్ద, అన్న ప్రసాదం ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వైవీ వామన్ రావు, కేతిరెడ్డి విజేందర్ రెడ్డి, బెండల అర్జున్ రావు, వద్దిరాజు శర్వాణి, వడిచర్ల శ్రీనివాస్ తో పాటు మాతృ మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### దత్త క్షేతంలో గురు పౌర్ణమి..

ఆషాడ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీ వరద దత్త క్షేత్రంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలు జరుగనున్నాయి. ఉదయం తైలంతో అభిషేకం, పౌర్ణమి దత్త హోమం, గురు పాదుక పూజ, భజన, దత్త కాగడా హారతులు, అన్నదానం నిర్వహించనున్నట్లు ట్రష్టి వైవీ వామన్ రావు తెలిపారు.

## అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ కు.. అతి ఉత్కృష్ట సేవా పతకం

**వరంగల్ వాయిస్, క్రైం :** గత 34 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో ఉత్తమ సేవలందిస్తున్న భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ అంగోత్ నరేష్ కుమార్ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అందించే అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికయ్యారు. పోలీసు శాఖలో 1991లో ఎస్సైగా ఎంపికైన నరేష్ కుమార్ అంచలంచెలుగా ఎదిగారు. 2006లో సీఐగా పదోన్నతి పొందారు. 2017లో డీఎస్పీగా ప్రమోషన్ పొంది మహబూబాబాద్, మామునూర్ ఏసీపీగా విధులు నిర్వర్తించారు. 2023 లో అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది ఖమ్మం పోలీసు కమిషనరేట్ లో అడిషనల్ డీసీపీగా విధులు నిర్వర్తించారు. తాజాగా భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీగా పనిచేస్తున్నారు. సమర్ధవంతమైన ఇన్వెస్టిగేషన్ తో నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయడంతో ప్రతిభ చూపిన నరేష్ కుమార్ ను ప్రభుత్వం ఈ పథకానికి ఎంపిక చేసింది. ఇంతకు ముందు నరేష్ కుమార్ సేవా పథకం, కఠిన సేవా పథకంతో పాటు, ప్రెసిడెంట్ గ్యాలంటరీ మెడల్ ను అందుకున్నారు. తాజాగా అతి ఉత్కృష్ట సేవా పథకానికి ఎంపికైన అదనపు ఎస్పీ నరేష్ కుమార్ ను జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అభినందించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com